"రాగవర్ధని"

'విజయ - రాఘవ'

(గతసంచిక తరువాయి)

'అక్కయ్య వస్తోందని' అందరూ అంటూండగానే భువనేశ్వరి రిక్షాదిగి లోపలికి వచ్చేసింది. వస్తూ-వస్తూ తమ్ముళ్లకు - చెల్లాయిలుకు పకోడీ - కారప్పూస పొట్లాలు తెచ్చి వాళ్ల చేతుల్లో పెట్టింది. వాళ్లు తింటూ యెటో ఆడుకోంటానికిపోయారు.

భువనేశ్వరి తనకు తెలిసిన కథంతా పూసగుచ్చినట్లు తల్లితో ముందు చెప్పేసింది. ఆ రాత్రికూడా అక్కడేవుండి తండ్రితోకూడా చెప్పింది. తల్లిని వొప్పించడం తేలికనిపించింది తండ్రికన్నా. ఎలాగైతే నేం "కట్నాలు - కానుకలు తీసికోకుండా రజనీకాంతుడి వివాహం చేయాలి" అని తల్చుకొని ఆ మరునాటినుండీ వివాహ ప్రయత్నాలు జరుపడానికి నిశ్చయించుకొన్నారు.

ఆరాత్రి సన్నజాజి పందిరిక్రింద, యిది వరకు తను వేసుకునే మడతమంచం వేసుకొని పడుకొంది. కాని కంటికి కునుకుపట్టడంలేదు. సగంరాత్రయిందప్పటికి. "తనుచేసిన ఘనకార్యం యేవిధమైన సంతోషంగా మారిపోయిందో" అన్నయ్యకు చెప్పాలని గబుక్కునలేచి, చెప్పులు తొడుక్కొని ఆ మసక మసక వెన్నెల్లో కృష్ణలానా గదిలో అన్నయ్య వుంటున్నాడని, తెలుసుకొని బయలుదేరింది. కిటికీలోంచి లోపలి వెలుగు కనిపిస్తోంది. 'రజనీకాంతుడు యేదో చదువుకొంటున్నాడుగదా' అని అనుకొంది. నెమ్మదిగా గదిదగ్గరకొచ్చింది.

'ఎవరో' మనిషిరావడం శబ్దం, వ్రాసుకొంటున్న రజనీకాంతుడికి క్రమేపీ వినిపించి, తగ్గిపోవడంతో, చేతిలో కలంకూడా వేగంహెచ్చి, తగ్గింది. కాని 'యెవరోలే' అని అంతలోనే అనిపించగానే మళ్లా కలం వేగంతో హెచ్చింది.

కూర్చుతున్న పాటలోకి తీయతీయని పదాలు దొర్లుకొస్తున్నాయి. ఆ భావమంతా తన అనుభూతిని వ్యక్తంచేస్తున్నట్లుగా తోచింది. తనలో తాను కూనిరాగంతో పాడుకొంటూన్నాడు. ఆ కూని రాగాలాపన చిరు తరంగాలు కిటికీలోంచి దూసుకొచ్చి భువనేశ్వరికి కమనీయంగా మారిపోయేటట్లు చేస్తున్నయి. 'అన్నయ్య ఎంత బాగా పాడతాడు' అని యీనాడు యెవ్వరూ చెప్పకుండానే తెలుసుకున్నట్లనిపించింది. 'లోపలికిపోతే యింకా బాగా వినవచ్చుగా' అని 'అన్నయ్యా!' అని పిలుద్దామనుకొంది. కాని, "యిప్పుడు పాడుతున్నట్లు పాడతాడా" అని సందేహం, "అసలు పాడతాడని నమ్మకంయేమిటి" అనే దుగ్ధ రెండూ సమ్మేళించడంతోనే రజనీకాంతుడు యిందాకటికంటే బిగ్గరగా గొంతుసారించి -

"ఏమవుతానో, నే
నేమవుతానో -
మరులునుగొలిపీ
మలయమారుత మవుతానో,
కమ్మని పూదేనెగ్రోలు
తుమ్మెద నవుతానో ॥ ఏ ॥
ఏంచేస్తానో, నే
నేం చేస్తానో -
కావాలని బిగియారా
కౌగిలించుకొంటానో,
మూంతిముదువకే నేను
ముద్దువెట్టుకుంటానో ॥ఏంచేస్తానో॥

చెట్టుచాటు దాగియుండి
చెంగుపట్టుకొంటానో -
బెట్టుచూపి బిగిసిపోతే
బ్రతిమలాడుకొంటానో ॥ఏంచేస్తానో॥

ఏమవుతానో నే
నేమవుతానో -
కళ్లతోడ కవ్విస్తే
కరిగి - సొరిగి పోతానో.
తెలినవ్వులు తొలకరిస్తే
పులకరించిపోతానో ॥ఏమవుతానో॥"

గదిమెట్లమీద కూర్చొని భువనేశ్వరి పాటంతా విన్నది.

"మా అన్నయ్యకు యెటువంటి కోర్కెలున్నయి? రాగవర్ధని అంటే వాడికెంత యిష్టం! కళ్లతోడ కవ్విస్తే కరిగిపోతాడట! నవ్వితేచాలట ఒళ్ళంతా పులకరించిపోతుందట! బెట్టుచూపి బిగిసిపోతే బ్రతిమలాడుకొంటాడట. రాగవర్ధనే సర్వస్వం అని నమ్మివేశాడు. యీ పాటబట్టి వాడి మనస్సెట్లా వుందో తెలుస్తోంది. ఆమె అంటే యింత యిదిగా వున్నప్పుడు వాడ్ని వేరుగాతల్చి, మరొక పిల్లనిచ్చి పెళ్లిచేయడం నిజంగా వాడిపట్ల ద్రోహంచేసినట్లుగానే వుండేది. నిలువునా వాడి జీవితం నాశనం చేసిన వాళ్ళమయ్యేవాళ్ళం" అని అనుకొంటూండగా పాటక్రమేపీ తగ్గిపోయింది. భువనేశ్వరి మెల్లిగా లేచి, తలుపుతట్టుతూ –

"అన్నయ్యా" - అంది.

రజనీకాంతుడు తన ప్రణయోన్మాదపు మధుర సంగీతంలోంచి తెప్పరిల్లి -.

"ఎవరూ" అన్నాడు.

"నేనేగా ... భువనను" అంది.

చటాలున వెళ్ళి తలుపుతీస్తూ - రజనీకాంతుడు.

"ఇదేమిటే! యింత అర్ధరాత్రిపూట వచ్చావ్". అన్నాడు.

"రావడం నాల్గుగంటలకే వచ్చాను. అమ్మ - నాన్నతో మాట్లాడి, భోజనాలయ్యేటప్పటికి యీ వేళయింది. ఒకసారి నిన్ను చూసిపోదామని వచ్చాను." అంటూ లోపలికివచ్చి చూసేటప్పటికి, టేబిల్ మీద వెలుగుతున్న దీపకాంతిలో మంచం మీద నిద్రపోతున్న రాగవర్ధన్ని ముఖం కళకళ లాడుతూండటం చూసి -

"అన్నాయ్! యిదేమిట్రా" అంది ఆశ్చర్యంగా.

రజనీ అనుకొంటూనే వున్నాడు - ఆ ప్రశ్న తప్పకుండా అడుగుతుందని.

"ఇందులో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. అందులో నువ్వేరగందేముంది" - అన్నాడు చిరునవ్వుతో.

"ఎంతచేసుకోనే అమ్మాయినైతే మాత్రం పెళ్లి కాకముందే యీ విధంగా సాకుతుంటే యెవరేమను కొంటారో - తెలుసా!"

"భువనా! యీ సంగతి యీ చుట్టుప్రక్కల వాళ్ళందరికి - మనలో కొందరికి తెలుసు. నీకూ యీ మధ్యే తెలిసింది. అదెలాగో నాకు తెలుసు. పెళ్లయిన తరువాత సాగించే బ్రతుకుని యెప్పుడే పెళ్ళయిందని అనుకొని సాగిస్తున్నాం. యిందులో నువ్వుగాని, లోకంగాని వింతగా చూడవల్సిందేమీ లేదు. మీ అందరి చూపుల కేంద్రీకరణలో నేను మంగళసూత్రం కట్టినప్పుడే అది పెళ్ళి అవటం అని పించుకొంటుందంటావ్. ఆ విషయాన్ని నేను కాదన లేను. దాన్ని నేను విమర్శించను. అందరి సమక్షంలోజరిగి, వారి హస్తాక్షితలు మేంధరించి, తలంబ్రాలు పోసుకోవడం పెళ్ళి అనిపించుకొంటుం దంటావ్. దాన్ని నేనొప్పుకొంటాను. కాని అది తప్పని నేననను. యెవరికీ యిష్టంలేనిది నాకిష్టమైనప్పుడు, నాకు, నా కిష్టమైనదానికి, సహాయ సంపత్తులు లేనప్పుడు ఒండొరుల ఆత్మలే పరిణయానికి సాక్షి. పంచ భూతాత్మకమైనది - చరాచర సృష్టిలయకారియై

ప్రకృతే అందరికంటే యెక్కువ సాక్షీభూతం. ఆ దృష్టిలోనే రాగవర్ధన్ని నేను యెన్నడో వివాహం చేసుకొన్నాను.

ఈ సంభాషణ యిలా సాగుతూండగా రాగవర్ధనికి కొంచెం మెలకువవచ్చింది. యేవో మాటలు తనకు సంబంధించినట్లుగా వినబడటంతో లేచి కూర్చొంది.

భువనేశ్వరి వూరుకోక - 'వదినా' - అంది.

రాగవర్ధని కళ్ళు నులుముకొంటూ, మంచందిగి, యేమనిపల్కరించాలో అర్థంకాక తికమకపడుతూ క్రిందచాపమీద చతికిలపడింది.

'వదినా' అనే టప్పటికి రజనీకాంతుడికి సంతోషంకలిగింది. కాని హేళనగా అనడం కాదు గదా అనిపించింది.

రాగవర్ధని ప్రక్కనవున్న కూజాలో కాసిని మంచినీళ్లు త్రాగి -

"ఎంతసేపయిందండీవచ్చి" అని పల్కరించింది.

భువనేశ్వరి కల్మషంలేని హృదయిని కాబట్టి -

"ఇప్పుడే వచ్చానమ్మా" - అంది నవ్వుతూ.

"మా సువర్చల బాగుందా" అని అడిగింది రాగవర్ధని.

"ఆ బాగానేవుంది" - అంది.

"ఇంత ప్రొద్దుపోయిన తర్వాత వచ్చారేం"

"నాల్గుగంటలకే మా అమ్మగారింటికొచ్చాను. రేప్రొద్దున్నే మళ్ళా వెడతాను. చూసి వెడదామని వచ్చాను. సమయానికి నువ్వూకూడా వున్నావ్. సరే యిద్దర్నీచూసినట్లుకూడా అయింది. పెళ్ళికాక ముందే ..." అంటూ భువనేశ్వరి రాగవర్ధని భుజం మీద చెయ్యివేస్తూ - రజనీకాంతునివంక చూస్తూ -

"అన్నయ్యా!" . అంది.

రజనీకాంతుడు సిగరెట్ ముట్టిస్తూ 'ఏమి టన్నట్లు చూశాడు.

"నీతో ఒక విషయం చెబుదామని వచ్చారా!" అంది భువనేశ్వరి.

రాగవర్ధనికి యేదో అనిపించింది. అది యిది సిద్ధంగాలేదు.

రజనీకాంతుడు వినడానికి ఆత్రుతపడుతూ -

"ఏమిటే భువనా!" - అని అడిగాడు.

"జాగ్రత్తగా వినాలిమరి. 'ఊ' కొట్టంగానే సరిగాదు. ఒకవేళ నీకమ్మాయి పుట్టినా, అబ్బాయి పుట్టినా మాతో వియ్యమొందాలిసుమా! దానికొప్పుకుంటేనేగాని నేను చెప్పను" అంటూ చెప్ప దల్చుకున్న విషయాన్ని దాచి దాచి బయటపెట్ట కుండా వుంటుంటే-

"అబ్బ! వూరికేనానపెట్టకు-చల్లకొచ్చి ముంత దాచుకొన్నట్లు యెందుకు దాస్తావ్" అన్నాడు రజని.

"ముందు వొప్పుకోండి" - అంది భువనేశ్వరి.

"వోసి నీ యిల్లు బంగారంగానూ, అసలు విషయంయేమిటో తెలియదు. వొప్పుకోమంటే యేమని వొప్పుకోం" - అన్నాడు రజనీకాంతుడు.

భువనేశ్వరి చెప్పడానికి నిశ్చయించుకొంది.

"మీ యిద్దరి పెళ్ళికి అమ్మ - నాన్న వొప్పుకున్నారు ... రేపటినుంచీ పెళ్ళి ప్రయత్నాలు చేస్తానన్నాడు నాన్న. వీలుగావుంటే యీ నెల లోనే చేస్తారట" అంటూ యేదో చెప్పుకొని పోతుంటే, తరువాత మాటలు రజనీకాంతుడుగాని, రాగవర్ధని గాని వినడం మానేసి, ఒకళ్ళ మొగాలొకళ్లు చూసుకొని నవ్వుకొంటూండగా, పెళ్ళికూతురికి స్వభావ సిద్ధంగా వచ్చేసిగ్గు రాగవర్ధనికి, పెళ్లికుమారునికి వుండవలసిన హుందాతనం రజనీకాంతుడికివచ్చి, పెద్దలు నిర్ణయించిన శుభలగ్నాన, కల్యాణవేదికమీద యిద్దరూ తలంబ్రాలు పోసుకొంటూండగా-"సీతమ్మ పెళ్లికూతురాయెనే" అనే సన్నాయి పాటలో శకుంతలమ్మ సంతోషం, సువర్చల - క్రాంతీనాథ్ ల ఆనందం, భువనేశ్వరి ఆనంద్ మోహన్ ల అనురాగం వరుని తల్లిదండ్రుల వాత్సల్యం నిబిడీకరించుకొని పోయింది.

కాని గేటువద్ద రాగవర్ధని కన్నతల్లి పార్వతమ్మ కార్చే ఆనంద బాష్పాలు, హృదయంలోంచి పెల్లుబికే మాతృత్వం నిబిడీకరించుకొని వుందో లేదో అనూహ్యం. కాని అది నగ్నసత్యం. దాగని - మాగని యుగధర్మం. కన్నబిడ్డ ఆనందం కన్నకడుపు అనుభవించినట్లు యితరంగా, యేదీ అనుభవించలేదు. యిది సృష్టిలోదాగిన మహత్తర విషయం. తెలుసుగోగల్గినవారే తెలివిగలవారు. అనుభవించినవారే ఆనంద స్వరూపులు.